సాక్షి
రంగారెడ్డి
శనివారం । 12 । ఆగస్టు । 2023



'మధ్యాహ్న' ఆకలి కేకలు!

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు పస్తులుంటున్నారు. 2లో▸



త్యాగాలను మరువలేం

దేశంకోసం ప్రాణాలర్పించిన అమర జవాన్ల త్యాగాలను మరువలేమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. 2లో▸


31న ఎంట్రెన్స్ టెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సీపీజీఈటీ-2023లో భాగంగా ఈ నెల 31న ఎంపీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎమ్మెస్సీ డేటా సైన్స్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు కొత్తగా హాల్ టికెట్లు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

డెంగీ పంజా

ఇళ్ల మధ్యే మురుగు.. విజృంభిస్తున్న దోమలు

- నియంత్రణ చర్యలు చేపట్టని మున్సిపాలిటీలు
- చాపకింద నీరులా విస్తరిస్తున్న జ్వరాలు
- ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 94 కేసులు నమోదు
- చికిత్స కోసం ప్రైవేటుకు బాధితుల పరుగు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: డెంగీ జిల్లా వాసులపై మళ్లీ పంజా విసురుతోంది. ఇప్పటికే మూడేళ్లుగా కోవిడ్ కారణంగా ఇటు ఆర్థికంగా, అటు ఆరోగ్యపరంగా చితికి పోయిన ప్రజలకు తాజాగా దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇంట్లో ఒకరి తర్వాత మరొకరు జ్వరాల బారినపడుతుండటం, పరీక్షల్లో డెంగీగా నిర్ధారణ అవుతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 94 కేసులు నమోదు కాగా, వీటిలో 75 గ్రేటర్ సమీప ప్రాంతాల్లోనే వెలుగు చూశాయి. ఫిబ్రవరిలో రెండు కేసులు నమోదైతే, మార్చిలో నాలుగు, ఏప్రిల్‌లో ఒకటి, మేలో ఐదు, జూన్‌లో 18, జూలైలో 49, ఆగస్టులో ఇప్పటి వరకు 15 చొప్పున నమోదవడం విశేషం. బాధితులంతా చికిత్స నిమిత్తం ఆయా ప్రాంతాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరారు.

ప్లేట్‌లెట్స్ కౌంట్స్.. ఐసీయూ చికిత్సలు

రోగుల్లో ఉన్న బలహీనతను అవకాశంగా తీసుకుని, ప్లేట్‌లెట్ కౌంట్స్, మందులు, ఐసీయూ చికిత్సల పేరుతో రోగుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్లేట్‌లెట్స్ కౌంట్ టెస్టులు, పునరుద్ధరణ, ఖరీదైన యాంటిబయాటిక్స్ మందులు, ఐసీయూ చికిత్సలు, వైద్యులు, నర్సింగ్, రూమ్ చార్జీల పేరుతో రోగుల నుంచి రోజుకు కనీసం రూ.20వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఆస్పత్రుల్లో దోపిడీ ఇలా ఉండగా.. రక్తనిధి కేంద్రాల్లో మరో విధంగా తయారైంది. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని గ్రూపులుగా విభజించి, ఆ తర్వాత ప్రాసెస్ చేస్తారు. దీని నుంచి ప్లాస్మా, పీఆర్‌పీ, ఎస్‌డీపీ, ఆర్‌బీసీ వంటి సెల్స్‌ను వేరుచేసి ప్యాకెట్‌లో నిల్వ చేస్తారు. పాజిటివ్ గ్రూప్ బ్లడ్‌సెల్స్‌తో పోలిస్తే నెగిటివ్ గ్రూప్ బ్లడ్ సెల్స్ అరుదుగా లభిస్తాయి. మార్కెట్లో వీటికి డిమాండ్ ఎక్కువ. ప్రభుత్వం సాధారణ బ్లడ్ ఒక యూనిట్‌కు రూ.1,450 ధర నిర్ణయించింది. ప్లేట్‌లెట్స్ ధరలపై స్పష్టమైన ప్రకటనంటూ ఏమీ లేదు. ఎన్‌జీఓ సంస్థలు నడుపుతున్న బ్లడ్‌బ్యాంకుల్లో ప్రభుత్వ ధరల మేరకే బ్లడ్ లభిస్తోంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లోని బ్లడ్‌బ్యాంకులు ఒక యూనిట్‌కు రూ.2,300 వరకు వసూలు చేస్తున్నాయి. ప్లేట్‌లెట్స్ ధరలపై ఆజమాయిషీ లేకపోవడంతో ఆయా బ్లడ్ బ్యాంకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. పాజిటివ్ గ్రూప్‌నకు ఒక ధర.. నెగెటివ్ గ్రూప్‌నకు మరో ధర నిర్ణయిస్తుండటంతో రోగులు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

దోమలకు నిలయాలు ఇవే..

ఇటీవల కురిసిన ఏకధాటి వర్షాలకు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ఇళ్ల మధ్య రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో వాటిలో డెంగీ కారక దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటితో పాటు ఇంటి ఆవరణలోని పూల కుండీలు, వాటర్ ట్యాంకులు, ఇంటిపై ఉన్న టైర్లు, ఖాళీ కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ డబ్బాలు, నూతన భవనాలు, వాటి సెల్లార్లు డెంగీ కారక దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలను శుభ్రం చేసుకోవడం, నిల్వ ఉన్న నీటిని తొలగించడం, చెట్ల పొదలను శుభ్రం చేసుకోవడం, సాయంత్రం వేళ ఫాగింగ్ నిర్వహించడం ద్వారా దోమలను నియంత్రించొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

లక్షణాలు గుర్తించొచ్చు ఇలా..

- దోమ కుట్టిన 7 నుంచి 8 రోజులకు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం రావడంతో పాటు కళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది.
- ఎముకలు, కండరాల్లో భరించ లేని నొప్పి, శరీరంపై ఎర్రటి పొక్కులు వస్తాయి.
- సాధారణంగా మనిషి రక్తంలో 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి.
- డెంగీ బాధితుల్లో రక్త కణాల (ప్లేట్స్ లెట్స్) సంఖ్య 40 వేలలోపు పడిపోతుంది.
- 20 వేలలోపు పడిపోతే ప్రమాదం. ఆ సమయంలో తిరిగి ఎక్కించాల్సి ఉంటుంది.
- లేదంటే అవయవాలన్నీ పనిచేయడం మానేసి మృత్యువాతపడే ప్రమాదం ఉంది.
- లక్షణాలు గుర్తించిన వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా డెంగీ నుంచి బయటపడొచ్చు.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

పిల్లలు జాగ్రత్త

- డెంగీ దోమలు ముఖ్యంగా పిల్లలపై ఎక్కువగా దాడి చేస్తున్నాయి.
- సాధ్యమైనంత వరకు కాళ్లు, చేతులు పూర్తిగా కవర్ చేసే దుస్తులు వేయాలి.
- పగలు నిద్రపోయే సమయంలో పడకపై రక్షణ కోసం దోమతెరలు వాడాలి.
- మస్కిటో మ్యాట్, మస్కిటో కాయిల్స్, ఆలౌట్ వంటివాటితో దోమలను నియంత్రించాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, పారిశుద్ధ్యలోపం లేకుండా చూసుకోవాలి.
- ఇంట్లోని పూలకుండీలను, వాటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.
- పాఠశాల ఆవరణతో పాటు చుట్టూ పక్కల పరిసరాల్లో పారిశుద్ధ్యలోపం లేకుండా చూడాలి.
- ఫాగింగ్, యాంటి లార్వ చర్యల ద్వారా ఎప్పటికప్పుడు దోమలను నియంత్రించాలి.
- మంచినీటి ట్యాంకులపై మూతలు పెట్టడం ద్వారా డెంగీ దోమలను దరి చేరకుండా చూడొచ్చు.

– డాక్టర్ రాజన్న, చిన్నపిల్లల వైద్యనిపుణుడు

పాలమూరు-రంగారెడ్డితో

సస్యశ్యామలం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

- ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు రావడం శుభపరిణామం
- కాళేశ్వరం కంటే వేగంగా పాలమూరు ప్రాజెక్టు పూర్తి
- విలేకరుల సమావేశంలో మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకానికి పర్యావరణ అనుమతులు లభించడం శుభపరిణామం అని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తితో జిల్లా సస్యశ్యామలమవుతుందని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం జిల్లెలగూడ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ ఒక్కో రంగానికి ప్రాధాన్యత ఇస్తూ.. రాష్ట్రాన్ని సమూలంగా అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరాన్ని మూడేళ్లలోనే పూర్తి చేసిన అపర భగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు. అదే స్ఫూర్తితో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును సైతం పూర్తి చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులు కట్టడం ఎంత ముఖ్యమో.. వాటికి అనుమతులు సాధించడం కూడా అంతే ముఖ్యమన్నారు. సీఎం ప్రత్యేక చొరవతోనే ఈ ఎత్తి పోతల పథకానికి పర్యావరణ అనుమతులు లభించాయని, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రజలు ఈ విషయంలో ఆయనకు ఎంతో రుణపడి ఉంటారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. తమ ప్రభుత్వంపై ఇక్కడి బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వారికి చేతనైతే.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకానికి జాతీయ హోదా తేవాలన్నారు. త్వరలోనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మరో కోనసీమగా మారబోతోందని చెప్పారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

మీర్‌పేట్: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని గాయత్రీనగర్‌లో శుక్రవారం గ్రంథాలయ ఎక్స్‌టెన్షన్ సెంటర్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, సభ్యురాలు మాధవి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఈవీఎం గోడౌన్ పరిశీలన



స్ట్రాంగ్‌రూం వద్ద కలెక్టర్ హరీశ్ తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాజేంద్రనగర్ ఈవీఎం గోడౌన్స్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ హరీశ్ పరిశీలించారు. నెలవారి తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన గోడౌన్‌సీల్ తీశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అనుకోని రీతిలో ప్రమాదాలు సంభవించిన సమయాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన అగ్నిమాపక సామగ్రి, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నా రు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సైదులు, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ పద్ధతుల్లో దత్తత నేరమే

అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్



దత్తత సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రతిమా సింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమ పద్ధతుల్లో దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరమని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శుక్రవారం ఎడవల్లి శాంతికిరణ్ కుమారుడు ఆర్య ఆదిత్యను మాదిశెట్టి ప్రవీణ్ దత్తత తీసుకున్నారు. అనంతరం దత్తత తల్లిదండ్రులకు బంధుత్వ దత్తత సర్టిఫికెట్‌ను అడిషనల్ కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అందరూచట్టబద్ధమైన దత్తతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అక్రమ పద్ధతుల్లో దత్తత తీసుకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకో వాలంటే బాలల పరిరక్షణ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పద్మజ, అధికారులు పాల్గొన్నారు.

అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ఆఫీసు ప్రారంభం



ప్రారంభిస్తున్న టీఎస్ క్యాంపు పీసీసీఎఫ్ లోకేష్‌జైస్వాల్ తదితరులు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ పరిధిలో నిర్మించిన కందుకూరు అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి కార్యాలయం, క్వార్టర్‌ను శుక్రవారం ఐఎఫ్ఎస్ అధికారి, తెలంగాణ క్యాంపు పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్ ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అటవీ భూములు, అటవీ జంతువుల సంరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్ సైదులు, డీఎఫ్ఓ సుధాకర్‌రెడ్డి, ఆమనగల్లు ఎఫ్‌డీఓ వేణుమాధవ్, ఎఫ్ఆర్ఓ సీహెచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు

డీజీపీ అంజనీకుమార్

గోల్కొండ: గోల్కొండ కోటలో పంద్రాగస్టు ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా చేయాలని డీజీపీ అంజనీ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కోటలోని రాణిమహల్ ప్రాంగణంలో పంద్రాగస్టు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. వీవీఐపీలు, వీఐపీల వాహన రూట్, పార్కింగ్ పాసులను సరైన సమయంలో అందజేయాలన్నారు. కోటకు వచ్చే మార్గాలన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆక్టోపస్ విభాగం వారు పతాకావిష్కరణ వేదిక పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఆయన వెంట జలమండలి ఎండీ దాన కిషోర్, ఐపీఎస్ అధికారులు స్వాతిలక్రా, నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ ఉన్నారు.

పెరిగిన పన్నులతో పేదలపై పెనుభారం

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: పెరిగిన అధిక పన్నులతో పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం పడుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. పెరిగిన ఇంటి పన్నులను తగ్గించాలని శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీలో కంటే పేదలు నివసించే మీర్‌పేట ప్రాంతంలోనే 50 శాతం అధికంగా పన్నులు వసూలు చేస్తున్నారని తెలిపారు. గతంలో పన్నులు తగ్గించాలని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తే తగ్గిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు కాలేదన్నారు. కాగా, దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మీర్‌పేట ఫ్లోర్‌లీడర్ చల్లా కవిత, కార్పొరేటర్ సిద్దాల మౌనిక, ఇతర నాయకులు ఉన్నారు.



మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలు

హుడాకాంప్లెక్స్: తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అకాడమీలో వాలీబాల్ క్రీడలో ప్రవేశాలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అర్హత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ఇ.వెంకటేశ్వర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17న ఉదయం 8 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ఎంపికకు 1-08-2005 నుంచి 31-08-2009 మధ్య జన్మించినవారు అర్హులు. 14 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సున్న బాలుర ఎత్తు 182 సెం.మీ. పైబడి, బాలికల ఎత్తు 166 సెం.మీ. పైబడి ఉండాలి. 16 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సున్న బాలుర ఎత్తు 189 సెం.మీ పైబడి, బాలికల ఎత్తు 170 సెం.మీ.పైబడి ఉండాలి. జనన ధ్రువీకరణ పత్రం, స్పోర్ట్స్ అచీవ్‌మెంట్ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు (ఒరిజినల్, జిరాక్స్) తేవాల్సి ఉంటుంది. స్టేట్ వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం అర్హులైన క్రీడాకారులు నేరుగా సంబంధిత ధ్రువ పత్రాలు, టీషర్ట్, నిక్కర్, షూస్ వేసుకుని రావా ల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 98483 64143 నంబర్‌లో సంప్రదించాలి.

ఈజీగా బస్సు జాడ

- మొబైల్ యాప్ ద్వారా వివరాలు
- గ్రేటర్‌లో 2,850 బస్సులకు జీపీఎస్
- ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం
- నేడు ప్రారంభించనున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్



సాక్షి, సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్: బస్సు కోసం పడిగాపులు కాస్తున్నారా? మీరు వెళ్లాల్సిన బస్సు ఎప్పుడొస్తుందో తెలియడం లేదా? బస్టాపుల్లోనే గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందా? ఇక నుంచి ఈ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. మొబైల్ యాప్ ద్వారా ఈజీగా బస్సు జాడను కనిపెట్టే సదుపాయం అందుబాటులోకి రానుంది. గ్రేటర్‌లోని అన్ని బస్సులకు వెహికిల్ ట్రాకింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. దీంతో ఏ బస్సు ఎక్కడుంది.. ఎంత సేపట్లో తాము ఎదురు చూస్తున్న బస్టాప్ వద్దకు చేరుకుంటుందనే సమాచారం ప్రయాణికులకు మొబైల్ యాప్‌లో లభించనుంది. కొద్ది రోజులుగా ప్రయోగాత్మకంగా పరిశీలించిన వెహికల్ ట్రాకింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రతి బస్సును జీపీఎస్‌తో అనుసంధానం చేయడంతో ఏ క్షణంలో బస్సు ఎక్కడుందో తెలుసుకొనే సదుపాయం లభించనుంది. ఇందుకు సంబంధించిన టీఎస్‌ఆర్టీసీ వెహికిల్ ట్రాకింగ్ మొబైల్ యాప్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శనివారం ఎంజీబీఎస్‌లో ప్రారంభించనున్నారు. నగరంలోని వివిధ మార్గాల్లో తిరిగే సుమారు 2,850 బస్సులతో పాటు ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే మరో 2,500లకుపైగా బస్సుల్లో వెహికిల్ ట్రాకింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

ఇంటి నుంచే ఈజీ జర్నీ..

వెహికల్ ట్రాకింగ్ మొబైల్ యాప్‌ను ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల ప్రయాణం ఎంతో తేలిక. ఉదాహరణకు ఉప్పల్ నుంచి మెహిదీపట్నంకు వెళ్లాల్సిన ప్రయాణికుడు '113ఎం'పైన క్లిక్ చేస్తే ఆ రూట్‌లో నడిచే బస్సుల వివరాలన్నీ తెలుస్తాయి. ఉప్పల్ నుంచి మెహిదీపట్నం వెళ్లేందుకు ఏ బస్సు ఏ సమయంలో బయలుదేరుతుందో తెలిసిపోతుంది. ఇప్పటికే ఆ రూట్‌లో నడుస్తున్న బస్సులు ఎక్కడున్నాయో కూడా తెలుసుకోవచ్చు. ఇంటి నుంచి బయలుదేరే సమయంలోనే ప్రయాణాన్ని ప్లాన్ చేసుకొనే వెసులుబాటు లభిస్తుంది. ఎయిర్‌పోర్టు నుంచి సిటీలో ఎక్కడికైనా వెళ్లేందుకు మొబైల్ యాప్ ద్వారా బస్సుల స్టేటస్‌ను తెలుసుకోవచ్చు.

కులవృత్తులకు బాసట

- మోడ్రన్ దోభీఘాట్లకు గ్రీన్‌సిగ్నల్
- అధునాతన యంత్రాలతో ఏర్పాటు
- ప్రతి మున్సిపాలిటీకి ఒకటి మంజూరు
- జిల్లా వ్యాప్తంగా 16 ఏర్పాటుకు నిధులు
- ఒక్కో యూనిట్‌కు రూ.2 కోట్లు కేటాయింపు
- పెరగనున్న ఉపాధి అవకాశాలు



మోడ్రన్ దోభీఘాట్ నమూనా

ఇబ్రహీంపట్నం రూరల్: రజక వృత్తికి మంచి రోజులు రానున్నాయి. దుస్తులు పట్టుకొని చెరువులు, కుంటల వైపు వెళ్లే బాధలు తప్పనున్నాయి. అధునాతన హంగులతో మోడ్రన్ దోభీఘాట్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక రంగాలను ఉపయోగించి వృత్తులను కాపాడటానికి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లల్లో మోడ్రన్ దోభీఘాట్ల నిర్మాణానికి మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పటికే సిరిసిల్లలోని వెంకంపేటలో మొట్టమొదటి సారిగా మోడ్రన్ దోభీఘాట్లను నిర్మించి రజకులకు ఉపాధి కల్పించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా నిధులు కేటాయించి అమలు చేస్తోంది.

జిల్లాకు 16 మంజూరు..

జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో మోడ్రన్ దోభీఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఎకరా పొలంలో దోభీఘాట్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో యూనిట్‌కి రూ.2 కోట్లు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా కేటాయించారు. ఇప్పటికే బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్లలో పనులు కొనసాగుతున్నాయి. 2 వేల చదరపు గజాల్లో పెద్ద షెడ్లు నిర్మిస్తారు. అనంతరం యంత్రాలను అమర్చుతారు. అధునాతన విధానంలో ఉతికే యంత్రాలు, ఉతికిన వాటిని ఆరబెట్టే యంత్రాలు, తరువాత ఇస్త్రీ చేసి పెట్టే యంత్రాలను ప్రభుత్వమే సమకూర్చనుంది. గంటకు ఒక సైకిల్ చొప్పున 240 దుస్తులు ఉతికి ఇస్త్రీ చేసే యంత్రాలను రూపొందించారు. ఒక షిఫ్టులో ఎనిమిది సైకిళ్లు ఉంటాయి, 1,920 దుస్తులు ఉతుకుతాయి. రెండు షిఫ్టుల్లో అయితే 3,840 దుస్తులను ఉతికి ఇస్త్రీ చేసే యంత్రాలను రూపొందించారు. గతంలో సోడా, సబ్బు వాడటం ద్వారా దుస్తులు పాడవడంతో పాటు రజకులు అనారోగ్యాల పాలయ్యేవారు. ప్రస్తుత యంత్రాలతో ఎలాంటి ప్రమాదాలు ఉండబోవని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీలో దోభీఘాట్ల నిర్మాణానికి భూమి కేటాయించి, అగ్రిమెంట్లు పూర్తి చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

మరింతగా ఉపాధి..

మోడ్రన్ యంత్రాల ద్వారా ఏర్పాటు చేయబోయే దోభీఘాట్లతో రజకులకు మరింత ఉపాధి లభించనుంది. ఇప్పటి వరకు వృత్తి అంటే ఇబ్బందులు పడే వారు కూడా యంత్రాలు వస్తే పనులు మళ్లీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. నిరుద్యోగులకు సైతం ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

అన్నివిధాలా సాయం..



బీఆర్ఎస్ అంటే అన్ని వర్గాలకు న్యాయం చేసే ప్రభుత్వం. కులవృత్తులకు అండగా నిలుస్తోంది. గతంలో గొర్రెల కాపర్ల కోసం గొర్రెలు, మత్స్యకారులకు అన్ని విధాలా సాయం చేసింది. మడుగున పడుతున్న కులాలను ఆదుకొని, వారికి ఉపాధి మార్గాలను కల్పిస్తోంది. ప్రభుత్వానికి వృత్తిదారులు అండగా ఉండాలి.

– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

వృత్తిదారులకు ఉపాధి



ఇప్పటికే ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీలకు రూ.2 కోట్ల చొప్పున కేటాయించింది. నిర్మాణం మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పూర్తి స్థాయిలో మిషనరీ వస్తుంది. అమెరికా స్థాయిలో ఏర్పాట్లు ఉంటాయి. ప్రజలకు ఎంతగానో ఉపయోగం. వృత్తిదారులకు ఉపాధి లభిస్తుంది.

– అమరేందర్‌రెడ్డి, కమిషనర్, ఆదిబట్ల

ఎమ్మెల్సీ పరామర్శ



విజయ్‌రాథోడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు విజయ్‌రాథోడ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం నగరంలోని మాక్స్‌క్యూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయ్‌రాథోడ్‌ను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, భాస్కర్, సందీప్ తదితరులున్నారు.

నీళ్లు వస్తున్నాయి.. భూములు అమ్ముకోకండి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నీళ్లతో రంగారెడ్డి జిల్లా పచ్చగా మారబోతోందని, రైతులు ఎవరూ భూములు అమ్ముకోవద్దని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు రావడంతో శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయని, ప్రతిపక్షాలు కేసులు వేయడంతో గ్రీన్ ట్రిబ్యూనల్ పనులు నిలిపివేయించిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు లేవని కోర్టు పర్యావరణ అనుమతులు ఇచ్చిందని తెలిపారు. గండిపేట, హిమాయత్‌సాగర్‌కు కాళేశ్వరం నీళ్లు తెచ్చేందుకు ప్రభుత్వం యోచిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, డైరెక్టర్‌లు రాజుగౌడ్, బిక్షపతిగౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు జయవంత్, రవియాదవ్, రాఘవేందర్ యాదవ్, సురేందర్‌గౌడ్, నర్సింహ్మగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

'మధ్యాహ్న' కార్మికుల ఆకలి కేకలు!

- అప్పులు చేసి భోజనం వడ్డిస్తున్న వైనం
- పది నెలలుగా అందని బిల్లులు
- నాలుగు నెలలుగా రాని గౌరవ వేతనం
- అవస్థల్లో 1,800 మంది
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కడుపునిండా వండి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు పస్తులుంటున్నారు. వంటావార్పు కోసం నిత్యం అగచాట్లు పడుతున్నారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పిల్లల ఆకలి బాధను తీరుస్తున్నారు. బకాయిలు చెల్లించాలని కోరుతూ రోడ్లెక్కి నిరసన చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని, కనీసం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. విద్యాశాఖ మంత్రిని కలిసినా బిల్లులపై స్పందన కరువైందని చెబుతున్నారు.

27.25 కోట్లు పెండింగ్

జిల్లా వ్యాప్తంగా 1,368 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందుకోసం 1నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 చెల్లిస్తుండగా 6నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.7 చెల్లిస్తున్నారు. వారంలో 5 రోజులు గుడ్లు అందిస్తున్నారు. పథకం అమలు కోసం ప్రతీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ముగ్గురు నుంచి ఆరుగురు వరకు పనిచేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 1,800 మంది ఉన్నారు. వీరికి 2022 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు బిల్లులు అందలేదు. జిల్లా వ్యాప్తంగా రూ.27.25 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గత నెల 12న రూ.75 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు రూ.6 లక్షలు వరకు రావాల్సి ఉంది. గుడ్లకు సంబంధించిన బకాయిలు సైతం చెల్లించడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. వీరిలో చాలా మంది పేదలు, నిరుపేదలే కావడంతో అప్పులు చేసి, ఒంటిపై ఉన్న చిన్నపాటి బంగారు నగలను సైతం తాకట్టు పెట్టి మరీ భోజనం వండి పెడుతున్నారు.



మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులు

గౌరవ వేతనానికీ దిక్కు లేదు

ప్రతినెలా ప్రభుత్వం కార్మికులకు అందజేస్తున్న రూ.వెయ్యి గౌరవ వేతనం ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు రాలేదు. కార్మికుల వేతనాలను రూ.వెయ్యి నుంచి రూ.2,500 పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ మార్చి 2022న ఆదేశాలు జారీ చేసినా, ఇప్పటికీ అమలు కాలేదని పేర్కొంటున్నారు. పెండింగ్ బిల్లుల కోసం కార్మికులు అన్నిరకాల ఆందోళనలు చేశారు. కలెక్టర్, విద్యాశాఖ మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. అయినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పుస్తెలతాడు కుదవబెట్టా..



మధ్యాహ్న భోజనం వండిపెట్టడం కోసం రూ.2 లక్షలు అప్పు చేశా. మూడు తులాల పుస్తెల తాడు కుదవబెట్టిన. బిల్లుల కోసం పది నెలలుగా ఎదురు చూస్తున్నాం. ఇప్పటి వరకు రావడం లేదు. ఏం చేయాలో అప్పులు ఎలా కట్టాలో తెలియడం లేదు.

– వై.స్వప్న, ఇబ్రహీంపట్నం

ఇంటి కాగితాలు తనఖా పెట్టా



పిల్లలంటే మాకు ప్రాణం. జీతాలు తక్కువే అయినా.. సామాజిక కోణంలో వండి పెడుతున్నాం. బిల్లులు రాకపోవడంతో ఇప్పటికే రూ.1.50 లక్షలు అప్పు చేశాం. ఇందుకోసం ఇంటి కాగితాలు తనఖా పెట్టా. ప్రభుత్వం స్పందించాలి.

– జె.శిరీష , శేరిగూడ

ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల మృతి

షాద్‌నగర్ రూరల్: రైలులో నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలోని కీర్తి వెంచర్ సమీపంలో శుక్రవారం వెలుగు చూసింది. గుర్తు తెలియని వ్యక్తి(32) రైలులో నుంచి జారి పడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

రైలు పట్టాలపై..

రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని యువకుడు(28) మృతి చెందాడు. మాస్టర్ విజయకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కారు ఇంజన్‌లో మంటలు

- పూర్తిగా దగ్ధమైన వాహనం
- బాటసింగారం వద్ద ఘటన
- మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారు ఇంజన్‌లోంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో వాహనం దగ్ధమైంది. పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్ బాలానగర్‌కు చెందిన జ్ఞాని వంశీధర్‌కు చెందిన మహేంద్ర ఎక్స్‌యూవీ కారును దరావత్ శివాజీ అనే వ్యక్తి లాంగ్ డ్రైవ్ కోసం విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తుండగా.. శుక్రవారం బాటసింగారం వద్ద ఇంజన్‌లో నుంచి పొగలు వచ్చాయి. వాహనం ఆపి పరిశీలిస్తుండగానే మంటలు వ్యాపించాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయంతో మంటలను ఆర్పివేయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే విజయవాడ జాతీయ రహదారిపై ఓ వైపు రహదారి విస్తరణ జరుగుతుండగా, మరో వైపు కారులో మంటలు చేలరేగడంతో భారీగా ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు జోక్యం చేసుకుని ట్రాఫిక్‌ను మళ్లించారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

రిమాండ్‌కు తరలించిన పోలీసులు

కొత్తూరు: క్యాబిన్‌లో నిద్రిస్తున్న ఓ లారీ డ్రైవర్‌పై దాడి చేసి డబ్బులు, ఏటీఎం కార్డును ఎత్తుకెళ్లిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శంకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనకాపల్లికి చెందిన పెంటారావు ఈ నెల 4న తన లారీతో కొత్తూరు విజయలక్ష్మి చౌరస్తాలో రాత్రి వేళలో క్యాబిన్‌లో నిద్రించాడు. తెల్లవారు జామున 4 గంటలకు స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు లారీలో నిద్రిస్తున్న అతనిపై దాడి చేసి రూ.8,700 నగదు, ఏటీఎం కార్డును అపహరించారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాహనదారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం ఉదయం పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టగా.. స్కూటీపై ఉన్న హైదారాబాద్, రాజేంద్ర నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఆరీఫ్(22), షేక్ దస్తగిరి(32), మహ్మద్ జాబేర్(19)లు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా లారీ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఘటన గురించి చెప్పారు. దాంతో పాటు గతంలో శంషాబాద్ పట్టణంలో గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుల నుంచి స్కూటీ(బైకు), దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధినం చేసుకున్నట్లు వెల్లడించారు.

పంటల పరిశీలన

ఆమనగల్లు: కోనాపూర్ గ్రామంలో పంట పొలాలను మండల వ్యవసాయాధికారి అరుణకుమారి పరిశీలించారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలను శుక్రవారం సందర్శించి.. రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పత్తిలో రసం పీల్చే పురుగులను నివారించడానికి ఎఫిసెట్ 1.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే పోషక లోపాల నివారణకు ఫార్ములా 4ను ఎకరాకు 400 గ్రాములు, కీటకాల గుడ్ల దశలో నివారణకు వేపనూనె 5 మి.లీలు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి అరుణకుమారి

క్రమశిక్షణ, పట్టుదలే విజయానికి సోపానాలు



ఎస్‌ఐలుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న డీసీపీ

ఆమనగల్లు: క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం విజయానికి సోపానాలని ఎల్‌బీ నగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మాస్టర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్నేహహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో ఎస్‌ఐలుగా ఎన్నికైన వారికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలుగా ఎన్నికైన మధు, రాకేశ్, దేవేందర్, లింగంగౌడ్, శ్రీను, శ్రీకాంత్, సునీతను డీసీపీ సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన ఏడుగురు ఎస్‌ఐలుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎస్‌ఐలుగా ఎన్నికైన వారు నిజాయితీగా పనిచేయాలని సూచించారు. నల్గొండ జిల్లా విజిలెన్స్ సీఐ గజ్జి చరమందరాజులు ,స్నేహహస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి యాదయ్య పాల్గొన్నారు.

అమర జవానుల త్యాగాలను మరువలేం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి

షాద్‌నగర్ రూరల్: దేశంకోసం ప్రాణాలను అర్పించిన అమర జవానుల త్యాగాలను మరువలేమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో నా దేశం.. నా మట్టి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సింహ్మారెడ్డి హాజరై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నిరంతరం ప్రజల్లో దేశభక్తిని పెంపొందిస్తున్నారని కొనియాడారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారతదేశం ఐదవ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, నాయకులు బాబయ్య, మిథున్‌రెడ్డి, అశోక్‌గౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ్మారెడ్డి